క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాంప్‌ను సందర్శించిన కల్నల్



వెంకటాచలం: 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని కల్నల్ అరుణ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. శిక్షణ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి క్యాడెట్లతో మాట్లాడారు. కార్యక్రమంలో గుండాల నరేంద్రబాబు, మల్లికార్జునరెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీహరి (ఫైల్)

పొదలకూరు: మండలంలోని బి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు..చెర్లోపల్లి గ్రామానికి చెందిన ముడి శ్రీహరిరెడ్డి (50) గురువారం రాత్రి తన సమీప బంధువును పొదలకూరులో వదిలిపెట్టేందుకు మోటార్‌బైక్‌పై వెళ్లాడు. తిరిగి చెర్లోపల్లికి మరో మార్గమైన చాటగొట్ల – బిరదవోలు రోడ్డుపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని గ్రామస్తులు, బంధువులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీహరిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీపై పశుదాణా



కొడవలూరు (విడవలూరు): మండలంలోని యల్లాయపాళెం పశువైద్యశాల ఆధ్వర్యంలో పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణాను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సురేష్‌బాబు మాట్లాడారు. రూ.1100 విలువజేసే దాణాను రూ.550కే రైతులకు అందజేస్తున్నామని వివరించారు. రైతులు ఏకొల్లు వంశీరెడ్డి, సుంకర సురేష్‌రెడ్డి, రాఘవేంద్ర, చిల్లకూరు యుగంధర్‌రెడ్డి, పశు వైద్యశాల సిబ్బంది వెంకయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు ప్రత్యేక శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణ, మండల పరిధిలోని చేనేతలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తామని సెర్ప్ సీఈఓ వాకాటి కరుణ పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపాళెంలో పొదుపు గ్రూపులకు సంబంధించిన మగ్గందారులతో శుక్రవారం నిర్వహించిన ముఖాముఖిలో ఆమె మాట్లాడారు. చేనేత కార్మికుల అవసరాలను గుర్తించి వారికి శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సాయాన్ని అందిస్తామని వివరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం మజరా పల్లిపాళెంలో సీతారామ నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలను శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, అష్టోత్తర శతకలశాభిషేకం తదితరాలను జరిపారు.

దత్తత విషయంలో నిబంధనలు పాటించండి

నెల్లూరు(పొగతోట): బాలికా సదన్, శిశుగృహలో ఉంటున్న పిల్లల్ని దత్తత ఇచ్చే విషయంలో తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దత్తత స్వీకార ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తప్పిపోయిన, వదిలివేయబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు మాధవి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, బాలల పర్యవేక్షణాధికారి శ్రీధర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.సురేష్, జీసీడీఓ మమత తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో దుష్పరిణామాలు

నెల్లూరు సిటీ: మాదకద్రవ్యాలతో సంభవించే దుష్పరిణామాలపై అవగాహన పోస్టర్లను నగరంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా అధికారి శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలిలా.. నీరందేదెలా..?

- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ పనులు
- చివరి ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకం
- ఆందోళనలో అన్నదాతలు

ఖరీఫ్ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్నారు. రెండో పంటకు సంబంధించి సోమశిల ప్రాజెక్ట్ ద్వారా మరికొద్దిరోజుల్లో నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే సాగునీటి కాలువలు దారుణంగా ఉండటంతో చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో సాగు చేపట్టాలా? లేదా? అనే ఆలోచనలో చాలామంది అన్నదాతలున్నారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు, వరిగొండ, మాచర్లవారిపాళెం సాగునీటి కాలువల ఆయకట్టు పరిధిలో అధికారికంగా సుమారు 12 వేల ఎకరాల్లో, అనధికారికంగా మూడు వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టే అవకాశాలున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పనులు ప్రారంభించారు. కొందరు దుక్కులు దున్నుతుండగా, మరి కొందరు నారుమళ్లను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. కాగా ప్రతి రబీ సీజన్‌లోనూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందిస్తుంటుంది. కానీ ఈ ఖరీఫ్‌లో విత్తనాలను సరఫరా చేయకపోవడంతో రైతన్నలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. బయట మార్కెట్‌లో ధరలు అధికంగా ఉండటంతో ఆందోళన చెందుతున్నారు.

సాగునీరు చేరేనా..

రెండో పంట (ఖరీఫ్) సాగుకు సంబంధించి ఈనెల 5వ తేదీ నుంచి సోమశిల జలాల విడుదలకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే నీరు చివరి ఆయకట్టు వరకు చేరాలంటే కాలువలు బాగుండాలి. ఎప్పుడైనా సోమశిల జలాల విడుదలకు పదిరోజుల ముందే ఇరిగేషన్ అధికారులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువల్లో మరమ్మతులు చేయిస్తుంటారు. కానీ ఈసారి అలాంటి పరిస్థితులు ఎక్కడా లేవు. ప్రస్తుతం కాలువలు గుర్రపు డెక్క, గడ్డి, మట్టి పూడికతో నిండిపోయాయి. ఈ పరిస్థితిలో సాగునీరు వదిలినా చివరి ఆయకట్టుకు చేరే అవకాశాల్లేవు. ఇటు ఇరిగేషన్ అధికారులు, అటు సాగునీటి సంఘాలు మరమ్మతులు చేపట్టే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అలాగే భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో పంటలు ముంపునకు గురికాకుండా కాపాడే వరద కాలువలు సైతం అధ్వానంగానే ఉన్నాయి.



పాపిరెడ్డిపాళెంలో అధ్వానంగా సాగునీటి కాలువ

నీరందే పరిస్థితి లేదు



మండలంలోని చాలాచోట్ల సాగునీటి కాలువలు గుర్రపుడెక్క, గడ్డి, చెత్తాచెదారాలతో నిండిపోయాయి. వాటిని తొలగించి కాలువలను శుభ్రపరిస్తేనే చివరి ఆయకట్టుకు నీరందుతుంది. గతంలో ప్రతి ఏడాది అధికారులు నీటి విడుదలకు ముందే కాలువల్లో మమరమ్మతులు చేపట్టేవారు. నేడు ఆ పరిస్థితి లేకపోవడంతో సాగు చేపట్టాలా? వద్దా? అనే ఆలోచనలో ఉన్నాం.

– కోటా శేఖర్‌రెడ్డి, రైతు, వరిగొండ

పూడికతీత పనులు చేపట్టాలి



గుర్రపుడెక్క, గడ్డి, చెత్తాచెదారాలతో దారుణంగా ఉన్న సాగునీటి కాలువలతోపాటు వరద నీటి కాలువల్లోనూ వెంటనే పూడికతీత పనులను చేపట్టాలి. భారీ వర్షాలు, తుపాన్లు సంభవిస్తే వరదనీరు పంటలను ముంచెత్తడంతోపాటు లోతట్టు గ్రామాలు సైతం ముంపునకు గురికావడం ఖాయం. అధికారులు స్పందించాలి.

– మన్నెం చిరంజీవులగౌడ్, రైతు, తోటపల్లిగూడూరు

ఇబ్బందుల్లేకుండా చూస్తాం

మండలంలో ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈనెల 5వ తేదీ నుంచి సోమశిల నుంచి నీటి విడుదలకు జిల్లా అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ప్రస్తుతం మండలంలో ప్రధానమైన సాగునీటి కాలువలన్నీ కొంతమేర గుర్రపుడెక్క, గడ్డి, చెత్తాచెదారాలతో నిండి ఉన్న మాట వాస్తవమే. నీటి విడుదలకు ముందుగానే కాలువల్లో మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం

– అలీ, ఇరిగేషన్ ఏఈ, తోటపల్లిగూడూరు



చిన్నచెరుకూరు సమీపంలోని వరదనీటి కాలువ ఇలా..



పేడూరు సమీపంలో వ్యవసాయ పనులు

రామాలయ పునర్నిర్మాణం

- నేడు బాలాలయంలోకి రాములోరి పటాలు

పొదలకూరు: దశాబ్దాల నాటి రామాలయాన్ని పునర్నిర్మించేందుకు ఉభయకర్తలు, భక్తులు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో బాలాలయాన్ని నిర్మించారు. శనివారం ఉదయం 7 గంటలకు మందిరంలోని సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి పటాలను బాలాలయంలో వైభవంగా చేరుస్తామని ఉభయకర్తలు శుక్రవారం వెల్లడించారు. 1939వ సంవత్సరంలో పట్టణ నడిబొడ్డున రామమందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి పూజలు, భజనలు నిర్వహించే వారు. మందిరం శిథిలావస్థకు చేరుకోసం కొత్తది నిర్మించేందుకు నడుం బిగించారు. ముందుగా భక్తుల భజనలు, పూజలకు ఆటంకం లేకుండా బాలాలయాన్ని నిర్మించి అక్కడ పటాలను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం నాటి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థులకు సన్మానం రేపు

పొదలకూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాయిబాబా మందిరంలో సన్మానిస్తామని జేవీవీ మండల శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు పాల్గొనాల్సిందిగా కోరారు.

డయాలసిస్ సెంటర్ ప్రారంభం నేడు

పొదలకూరు: పట్టణంలోని సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం పొదలకూరుకు విచ్చేస్తారని సూపరింటెండెంట్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు.

శివాలయంలో శంకరాచార్యుల జయంతి

పొదలకూరు: పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గాయత్రి ఉపాసక సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సమితి బాధ్యులు ప్రసాద్‌స్వామి, శివప్రసాద్, కుమార్‌స్వామి, ఎం.రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ఉపనయనాలను జరిపారు.



నీడ కరువై.. ఇబ్బంది పడుతూ..



బస్టాండ్‌లో నిలిచేందుకు నిలువునీడ కరువు



ఎండలో ఉన్న ప్రయాణికులు

పొదలకూరు: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ప్రయాణికులు నిలబడేందుకు సైతం నీడ లేదు. వేసవి కాలంలో బస్సులు, ఆటోల్లో ప్రయాణించే వారు ఎక్కడా కనీసం నిల్చునే దానికి సైతం నీడ కరువైంది. చంటి బిడ్డలు, లగేజీలతో ఇక్కడి నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే జనం ముఖ్యంగా మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారస్తులు దయ చూపితే వారి దుకాణాల ముందు నిలబడి బస్సులు, ఆటోలొస్తే ఎక్కి వెళుతున్నారు. ఈలోగా వేసవి తాపానికి అల్లాడిపోతున్నారు. ప్రయాణికులకు ఇక్కడ బస్‌షెల్టర్ ఉన్నా సరైన వసతులు లేకపోవడంతో నిలవలేకున్నారు. ప్రత్యామ్నాయంగా బస్టాండ్‌లో వసతులను కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

కండలేరు డీఈఈగా బాధ్యతల స్వీకరణ

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయ డీఈఈగా నిజి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె శ్రీకాకుళంలోని రాజాంలో ఏఈగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆమెకు ఇంజినీరింగ్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో డీఈఈ రవీంద్రబాబు, సిబ్బంది వెంకటసుబ్బయ్య, అంకయ్య, ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు తోట మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఈని సత్కరిస్తున్న అధికారులు

డిమాండ్లు నెరవేర్చేంత వరకు ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా

నెల్లూరు(అర్బన్): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేంత వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఏపీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ పేర్కొన్నారు. వివిధ డిమాండ్లతో సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులతో ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి రెబెకా, నేతలు సుగుణ, చైతన్య, హనుమానాయక్, హెప్సిబా, జ్యోతి, సుమ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీల ఏర్పాటు

కొడవలూరు (విడవలూరు): కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో బాలల సంరక్షణ కమిటీని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పర్యవేక్షణలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా హైస్కూల్ హెచ్‌ఎం మోహన రామలింగయ్య, ఏకొల్లు వంశీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, వీఆర్వో సుబ్బయ్య, వార్డు సభ్యులు హబీబున్నీసా, ఏఎన్‌ఎం సుకన్య, ఏఆర్డీ ఎన్జీఓ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్త ఇందూరు వేణి, మహిళా పోలీస్ మేరీ హెప్సీబా ఎంపికయ్యారు.

- కిశోరి వికాసం సమ్మర్ హాలిడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేగడిచెలికలో బాలల సంరక్షణ కమిటీని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఏఎన్‌ఎం షీలా, హర్షవర్ధన, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, ఆశ కార్యకర్తలు సరిత, కామాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు చెంచమ్మ, రాజేశ్వరి, అమలావతి, హెల్పర్ మాధురి పాల్గొన్నారు.
- **పొదలకూరు:** మండలంలోని విరువూరు ఇసకపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ మాట్లాడుతూ విద్య, బాలికా వివాహాలు, కుటుంబ పరిస్థితులు, బడి మానేయడం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే రూప, ఏఎన్‌ఎం అరుణ, వీఓఏ జయంతి, నసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధురి, గాయత్రి, అమరావతి, శ్రీలక్ష్మి, శీనమ్మ, ఆశావర్కర్ పెంచలమ్మ పాల్గొన్నారు.
- **మనుబోలు:** మండలంలోని పిడూరు గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ 11 నుంచి 15 ఏళ్లలోపు బాలికలను ఒక గ్రూపుగా, 15 నుంచి 18 ఏళ్ల లోపు వారిని మరో గ్రూపుగా విభజించి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగేంద్రమ్మ, అంగన్‌వాడీలు కృష్ణవేణి, విజయమ్మ, మహాలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.



పొదలకూరు: పోస్టర్ల ఆవిష్కరణ



మనుబోలు: మాట్లాడుతున్న రమణమ్మ



కొడవలూరు మండలంలోని యల్లాయపాళెంలో..

గిరిజన బాలిక చదువుకు అండగా ఉంటాం

నెల్లూరు(బారకాసు): గిరిజన బాలిక చదువుకు అండగా ఉంటామని మేయర్ స్రవంతి భరోసా ఇచ్చారు. బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్న బాలికను శుక్రవారం కలిసిన అనంతరం ఆమె మాట్లాడారు. కోట మండలానికి చెందిన బాలికకు అన్యాయంగా వివాహం చేసిన విషయాన్ని గిరిజన విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నేత చెంచయ్య తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. బాలికకు ఇష్టం లేకుండానే వివాహం జరపడంతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వచ్చేసి బాలసదన్‌లో ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. చదువుకోవాలనే కోరిక ఉందనే విషయాన్ని తనకు తెలియజేశారని, దీంతో బాలిక చదువుకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు సిటీ: ఏసీలో షార్ట్ సర్క్యూట్ మంటలు వ్యాపించడంతో ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోయిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కోటమిట్టలో ఉంటున్న షారూఖ్ ఏసీని ఆన్ చేసి గురువారం రాత్రి నిద్రించారు. తెల్లవారుజామున ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బయటకొచ్చిన ఆయన అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, మంచం దగ్ధమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: జాతీయ రహదారి దాటుతున్న ట్యాంకర్ లారీని మరో లారీ ఢీకొన్న ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సర్వేపల్లి వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ట్యాంకర్ లారీ జాతీయ రహదారి దాటుతుండగా, నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో హైవే మొబైల్ సిబ్బంది, ప్రయాణికులు బయటకు లాగారు. డ్రైవర్‌తోపాటుగా, క్లీనర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటన స్థలంలో వాహనాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలపై సమీక్ష నేడు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలపై శనివారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆర్డీఓ అనూష పాల్గొంటారన్నారు. పెంచలకోనలో టూరిజం హాల్లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.



పెంచలకోన క్షేత్రం